సాక్షి
కుమురం భీం
బుధవారం । 12 । జూన్ । 2024



పప్పుదినుసుల సాగుతో లాభాలు
పప్పుధాన్యాలకు మార్కెట్‌లో డిమాండ్ ఉంది. వీటి సాగుతో స్వల్పకాలంలో దిగుబడులు పొందడమే కాకుండా మంచి లాభాలు ఆర్జించవచ్చు. 10లో▸



కొనసాగుతున్న పనులు!
అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో ప్రభుత్వ బడుల్లో వసతులు కల్పిస్తున్నారు. కానీ పనులు అనుకున్నంత వేగంగా జరగడం లేదు. 11లో▸

గరిష్టం/కనిష్టం
38.4 /27.4

వాతావరణం
ఆకాశం కొంతమేర మేఘావృతమవుతుంది. ఉపరితల ఆవర్తనం, రుతుపవనాల ప్రభావంతో జిల్లాలో అక్కడక్కడ వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నేడు జిల్లాలో మంత్రి సీతక్క పర్యటన

ఆసిఫాబాద్: రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశుసంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ(సీతక్క) బుధవారం జిల్లాలో పర్యటించనున్నారని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.45 గంటలకు ఆసిఫాబాద్ మండలం అప్పపల్లి హైలెవల్ బ్రిడ్జి సందర్శిస్తారని ఆయన పేర్కొన్నారు. అనంతరం ఉదయం 10.40 గంటలకు వాడిగూడ గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు ఏకరూప దుస్తులు, పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు పంపిణీ చేసి, విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతారన్నారు. ఉదయం 11.55 గంటలకు జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహిస్తారని తెలిపారు. సాయంత్రం 3.15 గంటలకు వాంకిడి మండలం సవాతి గ్రామ పంచాయతీలో ప్రజలతో ఆత్మీయ సమ్మేళనం ఉంటుందన్నారు. జిల్లాలోని అన్ని శాఖల అధికారులు ప్రగతి నివేదికలతో సిద్ధంగా ఉండాలని ఆదేశించారు.

28న ఉచిత క్యాన్సర్ నిర్ధారణ వైద్యశిబిరం

రెబ్బెన(ఆసిఫాబాద్): రామకృష్ణాపూర్‌లోని సింగరేణి ఏరియా ఆసుపత్రిలో ఈ నెల 28న బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ వైద్యుల ఆధ్వర్యంలో ఉచితంగా రొమ్ము క్యాన్సర్ నిర్ధారణ వైద్యశిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు బెల్లంపల్లి ఏరియా అధికార ప్రతినిధి రెడ్డిమల్ల తిరుపతి ఒక ప్రకటనలో తెలిపారు. 45 ఏళ్ల పైబడిన మహిళా ఉద్యోగులు, ఉద్యోగుల కుటుంబాల్లోని మహిళలకు క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఈ వైద్యశిబిరం కేవలం మహిళలు, మహిళా ఉద్యోగుల కోసమేనని స్పష్టం చేశారు. బెల్లంపల్లి ఏరియాలోని మహిళా ఉద్యోగులు, వారిపై ఆధారపడిన మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆన్‌లైన్ ద్వారా బిల్లుల చెల్లింపు సులభతరం

ఆసిఫాబాద్‌అర్బన్: విద్యుత్ వినియోగదారులు గంటల తరబడి క్యూలో నిరీక్షించే అవసరం లేకుండా ఆన్‌లైన్ ద్వారా సులభంగా బిల్లులు చెల్లించవచ్చని విద్యుత్‌శాఖ సూపరింటెండెంట్ ఇంజినీర్ వాసుదేవ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. టెక్నాలజీ పెరిగిన నేపథ్యంలో వివిధ ప్లాట్‌ఫామ్‌ల ద్వారా ఆన్‌లైన్ చెల్లింపులను టీజీఎన్‌పీడీసీఎల్ సులభతరం చేసిందని ఆయన పేర్కొన్నారు. టీజీఎన్‌పీడీఎల్ మొబైల్ యాప్ ద్వారా చెల్లించిన బిల్లుల రశీదు సైతం పొందవచ్చన్నారు. ఇప్పటి నుంచి అందించే బిల్లులపై క్యూఆర్ కోడ్ ముద్రిస్తామని, మొదట ప్రయోగాత్మకంగా వరంగల్ సర్కిల్ పరిధిలో మట్టెవాడ ఈఆర్ సర్కిల్ కేంద్రంలో ప్రారంభించినట్లు తెలిపారు. త్వరలో జిల్లాలోనూ ప్రారంభిస్తామన్నారు. క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయడం ద్వారా బిల్లుకు సంబంధించిన వివరాలు చెల్లించాల్సిన మొత్తం తెలుసుకోవచ్చని ఎస్‌ఈ తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలి

రెబ్బెన(ఆసిఫాబాద్): బెల్లంపల్లి ఏరియాలోని గోలేటి ఫిల్టర్ బెడ్, బోర్‌వెల్ వద్ద సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ సివిల్ డిపార్ట్‌మెంట్ ఫిట్ కార్యదర్శి గడ్డం రమేశ్ కోరారు. మంగళవారం సివిల్ డిపార్టుమెంట్ ఎస్‌ఈ బాషాను కలిసి వినతిపత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ పంపు ఆపరేటర్ ఉండే స్థలం చుట్టూ పిట్టగోడ నిర్మించాలని అన్నారు. షెడ్డు ముందుభాగంలోని ఎలక్ట్రికల్ స్టార్టర్స్ కింద ఉండటంతో వర్షం కురిసిన సమయంలో విద్యుత్ షాక్‌కు గురయ్యే ప్రమాదం ఉందన్నారు. ఒక్క ఫీటు ఎత్తులో దిమ్మె నిర్మించి దానిపై స్టార్టర్లు ఏర్పాటు చేయాలని కోరారు. మెయిన్ వాల్ ఉన్న స్థలంలో రెండు 75హెచ్‌పీ పంపులు ఉన్న కారణంగా మెయిన్ వాల్ ఆన్ చేసేందుకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని, వాల్ లొకేషన్‌ను మార్చాలని విన్నవించారు. సింగరేణి ప్రధాన రోడ్డు నుంచి బోర్‌వెల్ వరకు వెళ్లే దారి మధ్యలోని కాలువపై కల్వర్టు నిర్మించాలని, సెక్యూరిటీ గార్డును నియమించాలని అన్నారు. పార్కింగ్ షెడ్డు నిర్మించాలని కోరారు. ఏరియా ఆర్గనైజింగ్ కార్యదర్శి జగ్గయ్య, నాయకులు రవి, రమేశ్ పాల్గొన్నారు.

మోగనున్న బడిగంట

- నేటి నుంచి పాఠశాలలు పునఃప్రారంభం
- సర్కారులో ప్రవేశాల కోసం కొనసాగుతున్న 'బడిబాట'
- ఇప్పటివరకు 950 మందికి అడ్మిషన్లు
- వేధిస్తున్న ఉపాధ్యాయుల కొరత
- హాజరుపై ప్రభావం చూపనున్న ఎండలు



ఆసిఫాబాద్‌లోని బాలికల ఉన్నత పాఠశాల

ఆసిఫాబాద్‌రూరల్: వేసవి సెలవులు ముగిశాయి. పాఠశాల్లో బడిగంట మోగనుంది. 2024– 25 విద్యాసంవత్సరం ప్రారంభం నేపథ్యంలో జిల్లా విద్యాశాఖ ప్రభుత్వ పాఠశాలలను సిద్ధం చేసింది. బుధవారం నుంచి తరగతులు ప్రారంభించేందుకు ఉపాధ్యాయులు సంసిద్ధమవుతున్నారు. సర్కారు బడుల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ఇప్పటికే అమ్మ ఆదర్శ కమిటీల ఆధ్వర్యంలో పనులు చేపడుతున్నారు. ప్రత్యేక నిధులతో తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్ వంటి సౌకర్యాలు కల్పిస్తున్నారు. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం ఈ విద్యా సంవత్సరం నుంచి 90 శాతం విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరును బయోమెట్రిక్ ద్వారా నమోదు చేయాలని భావిస్తోంది. ఇప్పటికే విద్యార్థులకు అవసరమైన 3,71,967 పాఠ్యపుస్తకాలు, 2,13,155 నోట్‌పుస్తకాలు జిల్లాకు చేరుకున్నాయి. 97,786 మీటర్ల క్లాత్‌తో 48,248 మంది బాలబాలికలకు ఒక జత చొప్పున యూనిఫాంలు కుట్టించారు. ఇవి మండల కేంద్రాల నుంచి పాఠశాలలకు చేరుకున్నాయి. అయితే వానాకాలం ప్రారంభమైనా వాతావరణం ఇంకా పూర్తిస్థాయిలో చల్లబడలేదు. మండుతున్న ఎండలు విద్యార్థుల హాజరుపై ప్రభావం చూపే అవకాశం ఉంది.

జిల్లాలో 1258 పాఠశాలలు

జిల్లాలో మొత్తం 1258 పాఠశాలలు ఉన్నాయి. ఇందులో డీఈవో పరిధిలో 720 ఉండగా.. మిగిలినవి గిరిజన, ఆశ్రమ, సంక్షేమ గురుకులాలు ఉన్నాయి. ప్రాథమిక పాఠశాలలు 560, ప్రాథమికోన్నత పాఠశాలలు 102, ఉన్నత పాఠశాలలు 58 ఉండగా.. కేజీబీవీలు మండలానికి ఒకటి చొప్పున 15, మోడల్ స్కూల్స్ 2, బీసీ, మైనార్టీ, ఎస్సీ, ఎస్టీ గురుకులు మొత్తం 521 పాఠశాలలు ఉన్నాయి. సుమారు 84 వేల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. జిల్లాలోని 685 ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో వసతులు కల్పించేందుకు రూ.25.50 కోట్లు కేటాయించారు. స్కూళ్ల పునఃప్రారంభం జూన్ 12 నాటికి వందశాతం పనులు పూర్తి చేయాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే ఆదేశాలు జారీ చేసినా క్షేత్రస్థాయిలో 70 శాతం మాత్రమే పూర్తయ్యాయి. కొన్నిచోట్ల పనులు నత్తనడకన సాగుతున్నాయి.

వేధిస్తున్న ఖాళీల బెడద

జిల్లాలో మొత్తం 341 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ప్రస్తుతం చేపట్టిన బదిలీలు, పదోన్నతుల ద్వారా 160 మంది ఎస్జీటీలకు పదోన్నతి లభించే అవకాశం ఉంది. దీంతో ప్రాథమిక పాఠశాలల్లో టీచర్ ఖాళీల సంఖ్య మరింత పెరగనుంది. రాష్ట్ర ప్రభుత్వం డీఎస్సీకి నోటిఫికేషన్ ఇచ్చినా ప్రక్రియ పూర్తయ్యేందుకు మరింత సమయం పట్టనుంది. ప్రతీ గ్రామంలో ప్రభుత్వ పాఠశాల ఉండాలని, పిల్లలు లేకపోయినా బడులు కొనసాగిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేసిన విషయం తెలిసిందే. జిల్లావ్యాప్తంగా 247 సింగిల్ టీచర్ స్కూళ్లు కొనసాగుతున్నాయి. గతంలో విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉంటే చిన్నారులను సమీపంలోని పాఠశాలకు పంపించేవారు. ఈ విద్యా సంవత్సరంలో ఎలాంటి చర్యలు తీసుకుంటారో తెలియాల్సి ఉంది. ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాల కల్పిస్తూ, నాణ్యమైన విద్య అందుతున్నా తల్లిదండ్రులు ప్రైవేట్‌కే మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది. చాలా మంది మూడు, నాలుగేళ్లకే పిల్లలను ఎల్‌కేజీ, యూకేజీ అంటూ ప్రైవేట్ స్కూళ్లకు పంపిస్తున్నారు. ప్రభుత్వ బడుల్లో ఐదేళ్లు నిండితేనే అడ్మిషన్లు తీసుకుంటుండటం సమస్యగా మారింది. అంగన్‌వాడీ కేంద్రాల్లో పూర్వ ప్రాథమిక విద్య అందుబాటులోకి వస్తే ఈ సమస్యకు పరిష్కారం దొరికే అవకాశం ఉంది.

'బడిబాట'లో 950 అడ్మిషన్లు

ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు పెంచడం, బడీడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలనే ఉద్దేశంతో ఈ నెల 6 నుంచి చేపట్టిన బడిబాట కార్యక్రమం సత్ఫలితాలను ఇస్తోంది. ఇప్పటివరకు 950 మంది చిన్నారులను బడిలో చేర్పించినట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు. ఈ నెల 12 నుంచి ఉపాధ్యాయులు, ఆదర్శ కమిటీ సభ్యులతో కలిసి ఉదయం 7 గంటల నుంచి 9 వరకు బడిబాట కార్యక్రమంలో పాల్గొనున్నారు. ఉదయం 9 గంటల తర్వాత పాఠశాలలో తరగతులు నిర్వహించనున్నారు. జిల్లాలోని ఐదు ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో 973 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఐదేళ్లు నిండిన చిన్నారులు ఆరు వేల మంది ఉన్నారు. వీరిని సమీపంలో ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాల్సి ఉంది.

ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్య



ప్రభుత్వ పాఠశాలల్లో ప్రైవేట్, కార్పొరేట్‌కు దీటుగా నాణ్యమైన విద్య అందిస్తాం. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో వసతులు కల్పిస్తున్నాం. ముఖ్యంగా బాలికల మరుగుదొడ్ల నిర్మాణంపై దృష్టి సారించాం. 2024– 25 విద్యా సంవత్సరంలో 950 అడ్మిషన్లు తీసుకున్నాం. టీచర్లు, విద్యార్థులకు బయోమెట్రిక్ హాజరు అమలు చేస్తాం. విద్యారంగంలో జిల్లాను ముందుంచేందుకు కృషి చేస్తాం.

– అశోక్, డీఈవో

అమ్మతోనే మొదటిసారి స్కూల్‌కు..



ఆసిఫాబాద్: చిన్నప్పుడు అమ్మతోనే మొదటిసారి స్కూల్‌కు వెళ్లా. ఖమ్మం జిల్లా బోనకల్లులో ఐదు కిలోమీటర్లు స్కూల్‌కు నడిచి వెళ్లేవాడిని. వేసవి సెలవులు పూర్తయి బడికి వెళ్లాలంటే ఓ వైపు బాధగా ఉన్నప్పటికీ, కొత్త బట్టలతో వెళ్లడం ఎంతో ఆనందంగా ఉండేది. ఓ సారి ఆదివారం స్పెషల్ క్లాస్‌లో టీచర్ పాఠం చెబుతుండగా నవ్వాను. దీంతో టీచర్ ఎందుకు నవ్వుతున్నావని కొట్టింది. మరోసారి తరగతి గది నుంచి ఒంటికి బయటి వెళ్లాను. తిరిగి క్లాసులోకి రాగా 'ఎవరిని అడిగి బయటకు వెళ్లావు' అని టీచర్ అడిగింది. నువ్వే వెళ్లమన్నావని చెప్పా. దగ్గరకు పిలిచి గట్టిగా గిల్లడంతో కళ్లకు నీళ్లు వచ్చాయి. చివరగా.. పెద్ద వారిని నువ్వు అని అనొద్దు.. మీరు అనాలని టీచర్ చెప్పింది. పాఠశాల విషయాలు ఎప్పటికీ మర్చిపోను. జ్ఞాపకాలు ఇప్పటికీ గుర్తుకొస్తాయి.

– ప్రభాకర్‌రావు, అదనపు ఎస్పీ

మ్యాథ్స్ టీచర్ స్ఫూర్తితోనే.. ఐఏఎస్



కైలాస్‌నగర్: మాది పంజాబ్ రాష్ట్రంలోని బర్నోలా గ్రామం. నాన్న బిపిన్ గుప్తా మెడికల్ ప్రాక్టీసనర్. అమ్మ మంజు గుప్తా. నా చదువంతా ప్రైవేట్‌లోనే సాగింది. స్కూల్ వాతావరణం ఎంతో ఇష్టం. మా గ్రామానికి ఏడు కిలోమీటర్ల దూరంలో గల పాఠశాలలో ప్రాథమిక విద్యాభ్యాసం పూర్తయింది. ఏ ఒక్క రోజు కూడా బడికి వెళ్లేందుకు మారం చేయలేదు. హుషారుగా వెళ్లేదాన్ని. మ్యాథ్స్ సబ్జెక్ట్ అంటే నాకు చాలా ఇష్టం. అభినవ్ జైన్ అనే మ్యాథ్స్ టీచర్ స్ఫూర్తితోనే నేను ఐఏఎస్ కావాలనే లక్ష్యం ఏర్పడింది. ఆ దిశగా ముందడుగు వేసి అనుకున్న లక్ష్యం సాధించాను.

– ఖుష్బూ గుప్తా, ఐటీడీఏ పీవో

బడి.. యాదిలో!

తెలిసీతెలియని వయస్సులో చేతిలో పలక, బలపంతో అమ్మ చేతి పట్టుకుని.. అన్న, అక్కతో కలిసి పాఠశాలకు వెళ్లడం అందరికీ మర్చిపోలేని జ్ఞాపకం. బడికి వెళ్లనని మారం చేసిన రోజుల్లో తల్లిదండ్రులు లాలించి.. కాస్త బెదిరించి స్కూల్‌కు పంపిస్తుంటారు. అలా తొలి అడుగు నుంచి ప్రారంభమైన నేడు ఎంతో మంది ఉన్నత విద్యాభ్యాసం పూర్తి చేశారు. జిల్లాలో బుధవారం నుంచి పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో పలువురు అధికారులు ప్రాథమిక విద్యాభ్యాసంపై తమ అనుభవాలను 'సాక్షి'తో పంచుకున్నారు.

రోజుకు రెండు కిలోమీటర్ల నడక



ఆసిఫాబాద్‌అర్బన్: మాది జగిత్యాల జిల్లా కోరుట్ల. అప్పట్లో ప్రైవేట్ పాఠశాలలు తక్కువగా ఉండేవి. ప్రతిరోజూ రెండు కిలోమీటర్ల దూరంలోని ప్రభుత్వ పాఠశాలకు వెళ్లి పదో తరగతి పూర్తి చేసిన. ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో ఈ రోజు ఉన్నత స్థాయిలో నిలిచా. జూన్ సమీపిస్తుందంటే బడికి వెళ్లేందుకు ఎంతో ఉత్సాహంగా ఉండేది. పాఠశాలల పునఃప్రారంభం రోజు పండుగ వాతావరణంలో బడికి వెళ్లేవాళ్లం. అప్పట్లో గురువులను దైవంగా భావించేవారు. విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణ ఎంతో అవసరం. అదే మనిషిని ఉన్నతస్థాయిలో నిలబెడుతుంది.

– డా.ఆడెపు భాస్కర్, జిల్లా సంక్షేమశాఖ అధికారి

అక్క బడిలో దించేది



ఆసిఫాబాద్‌రూరల్: మాది బెజ్జూర్ మండలం కుంటలమానెపల్లి. స్థానికంగా ఉండే గిరిజన ఆశ్రమ పాఠశాలలో నాలుగో తరగతి వరకు చదువుకున్నా. అమ్మానాన్న ఉదయం ఆరింటికే వ్యవసాయ పనులకు వెళ్లేవారు. చిన్నప్పుడు అక్క ఎత్తుకుని బడిలో దించివచ్చేది. బడికి రాకున్నా.. చదవకున్నా అప్పటి టీచర్లు క్లాసులోని బాలికలతో ముక్కు దెబ్బలు కొట్టించేవారు. కర్రతో చేసిన పలకలు వాడేది. బడిలో కూడా బ్లాక్‌బోర్డులు కూడా కర్రతో చేసినవే ఉండేవి. టీచర్లంటే చిన్నతనంలో భయం ఉండేది. ఐదో తరగతి నుంచి పదో తరగతి వరకు కాగజ్‌నగర్ ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్నా. సర్కారు బడి విద్యార్థికి అన్ని నేర్పిస్తుంది.

– శంకర్, డీఐఈవో

పిప్పర్‌మెంట్ కొనిస్తేనే బడికి..



ఆసిఫాబాద్‌రూరల్: ఖమ్మం జిల్లాలోని మల్లెపల్లి గ్రామంలో ఒకటో తరగతి నుంచి ఐదు వరకు చదువుకున్నా. ఒకటో తరగతిలో బడికి పోను అని మారం చేస్తే మా అమ్మ పిప్పర్‌మెంట్ కొనిచ్చేది. పిప్పర్‌మెంట్ చేతిలో పెట్టి బడికి తీసుకుపోయి దించి వచ్చేది. ఇంటికి వచ్చేటప్పుడు మాత్రం దోస్తులతో కలిసి వచ్చేది. ప్రభుత్వ బడిలో చదవడంతోనే ఈ స్థాయిలో ఉన్నాను. విద్యార్థులు ప్రభుత్వ విద్యను సద్వినియోగం చేసుకోవాలి.

– రమాదేవి, డీటీడీవో

అధికారులు ప్రొటోకాల్ విస్మరించొద్దు

- ఎమ్మెల్యే కోవ లక్ష్మి
- ఇన్‌చార్జి జెడ్పీ చైర్మన్ కృష్ణారావు అధ్యక్షతన స్థాయీసంఘాల సమావేశం



మాట్లాడుతున్న ఇన్‌చార్జి జెడ్పీ చైర్మన్ కృష్ణారావు, పక్కన ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలో ప్రభుత్వ కార్యక్రమాల్లో అధికారులు ప్రొటోకాల్ విస్మరించొద్దని ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. జిల్లా కేంద్రంలోని జెడ్పీ సమావేశ మందిరంలో మంగళవారం ఇన్‌చార్జి జెడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణారావు అధ్యక్షతన జిల్లా స్థాయి సంఘాల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జిల్లాలో చేపడుతున్న అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం విషయంలో అధికారులు తీరు మార్చుకోవాలని హితవు పలికారు. మన ఊరు– మనబడి పథకం కింద చేపట్టిన పనులకు బిల్లులు వెంటనే చెల్లించాలని, లేనిపక్షంలో పాఠశాలలకు తాళం వేయాల్సిన పరిస్థితి ఉత్పన్నమవుతుందని జెడ్పీ చైర్మన్ కృష్ణారావు అన్నారు. బిల్లులు రాక కాంట్రాక్టర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. జిల్లా పరీక్షల సహాయ కమిషనర్ ఉదయ్‌బాబు మాట్లాడుతూ మన ఊరు– మనబడి పనుల బిల్లులకు బడ్జెట్ ఇంకా విడుదల కాలేదని తెలిపారు. ఆసిఫాబాద్ నుంచి అడ గ్రామం వెళ్లే మార్గంలో కుడి కాలువపై రోడ్డు గుంతలమయంగా మారిందని, చెట్లకొమ్మలు తొలగించి మరమ్మతులు చేపట్టాలని ఎమ్మెల్యే కోవ లక్ష్మి అధికారులను ఆదేశించారు. వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో అందవెల్లి వంతెన నిర్మాణ పనులు పూర్తి చేయాలని జెడ్పీటీసీ శ్రీరాములు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. పనులు చివరి దశలో ఉన్నాయని, త్వరలో పూర్తి చేస్తామని ఈఈ పెద్దన్న సమాధానం ఇచ్చారు. జిల్లాలో పలు రోడ్డు పనులకు టెండర్లు పూర్తయినా పనులు ఎందుకు ప్రారంభించడం లేదని జెడ్పీ చైర్మన్ కృష్ణారావు అధికారులకు ప్రశ్నించారు. జిల్లా ఆస్పత్రిలో పని చేస్తున్న కాంట్రాక్టు వైద్యులకు సకాలంలో వేతనాలు అందడం లేదని జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు జిల్లా వైద్యాధికారి దృష్టికి తీసుకువచ్చారు. వానాకాలం సీజన్ సాగు ప్రారంభమైనందున రైతులకు ఇబ్బందులు రాకుండా చూడాలని రెబ్బెన జెడ్పీటీసీ సంతోష్ కోరారు. సమావేశంలో డిప్యూటీ సీఈవో లక్ష్మీనారాయణ, డీఆర్‌డీవో సురేందర్, సీపీవో పాపయ్య, ఈఈలు ప్రభాకర్, గుణవంత్‌రావు, వెంకటపతి, డీఎంహెచ్‌వో తుకారాం, డీడీ రమాదేవి, ఎస్సీ వెల్ఫేర్ అధికారి సజీవన్, బీసీ వెల్ఫేర్ అధికారి సత్యనారాయణ, జెడ్పీటీసీ అజయ్, ద్రుపదాబాయి, పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

తగినంత వర్షం పడితేనే 'పత్తి' విత్తుకోవాలి

- జిల్లా వ్యవసాయాధికారి రావూరి శ్రీనివాసరావు
- 'సాక్షి' ఫోన్‌ఇన్‌లో రైతుల సందేహాల నివృత్తి



రైతులకు సమాధానాలు ఇస్తున్న డీఏవో రావూరి శ్రీనివాసరావు

ఆసిఫాబాద్: తగినంత వర్షం పడి భూమి చల్లబడితేనే జిల్లా రైతులు పత్తి విత్తనాలు విత్తుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి రావూరి శ్రీనివాసరావు అన్నారు. సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని ఆయన పేర్కొన్నారు. మంగళవారం 'సాక్షి' ఆధ్వర్యంలో నిర్వహించిన ఫోన్‌ఇన్ కార్యక్రమంలో రైతుల ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చి, వారి సందేహాలను నివృత్తి చేశారు. లూజు విత్తనాలు ఎట్టి పరిస్థితుల్లోనూ కొనుగోలు చేయొద్దన్నారు. పంట చేతికందే వరకు బిల్లులు భద్రపర్చుకోవాలని సూచించారు.

పత్తి విత్తనాలు ఏ సమయంలో విత్తుకోవాలి?

– భీమన్‌కార్ రావుజీ, బూర్గుడ, మం.ఆసిఫాబాద్

డీఏవో: జూన్ మొదటి వారం పూర్తయినప్పటికీ జిల్లాలో ఇప్పటికీ ఎండల తీవ్రత కొనసాగుతోంది. ఎండల్లో తొందరపడి విత్తనాలు పెట్టొద్దు. కనీసం 60 నుంచి 70 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైతేనే విత్తనాలు విత్తాలి. ఇప్పుడు వేసిన విత్తనాలు భారీ వర్షం కురిస్తే కుళ్లి పోయే అవకాశం ఉంటుంది.

వరినార్లు ఎప్పుడు పోసుకోవాలి?

– అనుముల సంజీవ్‌చారి, మోతుగూడ, మం.ఆసిఫాబాద్

డీఏవో: జూన్ 15 నుంచి జూలై 15లోగా వరి నార్లు పోసుకోవడం పూర్తిచేయాలి. వరి 150 రోజుల పంట. ఆలస్యమైతే గింజ బరువు రాదు. నాట్లకు ముందే ముందే జీలుగు, పచ్చిరొట్టి కూడా వేసుకోవాలి.

జిల్లాలో వర్షాల రాక ఎప్పటి నుంచి ఉండే అవకాశం ఉంది?

– మహేందర్, పులికుంట, మం.రెబ్బెన

డీఏవో: జిల్లాలో బుధవారం నుంచి వర్షాలు పడే సూచనలున్నాయి. తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షం కురిసేందుకు ఆస్కారం ఉందని వాతావరణ శాఖ చెబుతుంది. వాతావరణం చల్లబడితేనే విత్తనాలు విత్తే ప్రక్రియ ప్రారంభించాలి. ఎండల్లో విత్తనాలు విత్తితే దిగుబడిపై ప్రభావం చూపుతుంది.

వ్యాపారులు అధిక ధరలకు విత్తనాలు విక్రయిస్తున్నారు.. ఆర్థికంగా నష్టపోతున్నాం.

– గుప్పుల వెంకటేశ్, కౌటాల

డీఏవో: విత్తన వ్యాపారులు బిల్లులో ఒక రేటు రాసి, డబ్బులు అధికంగా తీసుకుంటే నేరుగా అధికారులకు ఫిర్యాదు చేయాలి. ఎమ్మార్పీకే విత్తనాలు విక్రయించాలి. సంబంధిత వ్యాపారిపై ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం. జిల్లాలో టాస్క్‌ఫోర్స్ బృందాలు కూడా పని చేస్తున్నాయి.

వరిలో ఏ వంగడాలు వేసుకుంటే మేలు?

– రాజ్‌కుమార్, నంబాల, మం.రెబ్బెన

డీఏవో: వరి సన్నరకాల్లో బీపీటీ, జేజీఎల్, తెలంగాణ సోన, డబ్ల్యూజీఎల్– 44(సిద్ధి) ఉన్నాయి. ఈ నెల 20 వరకు నారు పోసుకునే ప్రయత్నం చేయాలి. నారు మడిలో ఒక కిలో కార్బో ఫిరామిన్ వేయాలి. దీని ద్వారా 45 రోజుల వరకు పురుగు బెడద ఉండదు. 22 నుంచి 24 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది.

పత్తి పంటలో డీఏపీ ఎప్పుడు వేయాలి?

– బోయినె తిరుపతి, అంకుసాపూర్, మం.ఆసిఫాబాద్

డీఏవో: పత్తి విత్తనాలతోపాటు మొలక రాకముందే డీఏపీ వేయాలి. నెల రోజుల తర్వాత వేసినా ఫలితం ఉండదు. సాలు పద్ధతిలో పంట సాగు చేసుకోవాలి. ఒకే రకమైన విత్తనాలు నలుగురు రైతులు వేస్తే, సాగు విధానం, భూమిని బట్టి ఒక్కొక్కరికి ఒక్కో విధంగా దిగుబడి వస్తుంది.

పత్తిలో ఏ రకం విత్తనాలు మేలు?

– తిరుపతి, ఈదులవాడ, మం.ఆసిఫాబాద్

డీఏవో: పత్తిలో ప్రభుత్వం ఆమోదించిన అన్ని రకాల విత్తనాలు మంచివే. బీజీ– 2 విత్తనాల్లో అనేక రకాలు ఉన్నాయి. ఏదైనా ఒకేవిధంగా దిగుబడి ఇస్తుంది. ఒకే రకమైన విత్తనాలపై ఆధారపడొద్దు. రెండు, మూడు రకాల ఎంచుకొని సాగు చేయాలి.

వరి పంటకు ఎరువులు ఎప్పుడెప్పుడు వేయాలి?

– కిషన్, రెబ్బెన

డీఏవో: వరి పంటలో దమ్ము కొట్టడం, నారు వేసే సమయంలోనే డీఏపీ వేయాలి. ఎకరాకు ఒక బస్తా సరిపోతుంది. 25 రోజుల తర్వాత ఎకరాకు 30 కిలోల చొప్పున మూడు దఫాలుగా యూరియా, 15 కిలోల పొటాష్ వేయాలి. దీంతో నాణ్యమైన దిగుబడి వస్తుంది. పత్తిలో మొలక రాక ముందు పెండి మెథాలిన్ గడ్డి మందు వేయాలి.

బడుల్లో పనులు పూర్తి చేయాలి

- అదనపు కలెక్టర్ దీపక్ తివారి



పనులు పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

ఆసిఫాబాద్‌రూరల్: ప్రభుత్వ బడుల్లో అమ్మ ఆదర్శ కమిటీల ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి పనులు నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ త్వరగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. ఆసిఫాబాద్ మండలం వాడిగూడ, అడ, ఈదులవాడ, వాంకిడి మండలం ఘాట్‌జంగాం, గోయగాం పాఠశాలల్లో చేపట్టిన పనులను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ బుధవారం నుంచి పాఠశాలలు ప్రారంభమవుతున్నాయన్నారు. విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా తరగతి గదులను శుభ్రం చేయాలని సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం అమ్మ ఆదర్శ కమిటీల ఆధ్వర్యంలో వసతులు కల్పిస్తుందని పేర్కొన్నారు. అధికారులు సమన్వయంతో పని చేస్తూ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతీ పాఠశాలకు తాగునీరు, మూత్రశాలలు, విద్యుత్ సౌకర్యం కల్పిస్తామన్నారు. ఆయన వెంట సంబంధిత అధికారులు ఉన్నారు.

బర్త్ సర్టిఫికెట్ లేక 'ఆధార్'కు దూరం

రెబ్బెన(ఆసిఫాబాద్): మండలంలోని నక్కలగూడలో బర్త్ సర్టిఫికెట్లు లేక 35 మంది చిన్నారులు ఆధార్ కార్డు పొందలేని పరిస్థితి ఏర్పడింది. పిల్లల తల్లిదండ్రులతో కలిసి జెడ్పీటీసీ వేముర్ల సంతోష్ మంగళవారం జిల్లా కేంద్రంలో ఆర్డీవో లోకేశ్వర్‌ను కలిసి సమస్య వివరించారు. జెడ్పీటీసీ మాట్లాడుతూ 5 నుంచి 12 సంవత్సరాల లోపు వారు సుమారు 35 మంది పిల్లలకు ఇప్పటివరకు ఆధార్ కార్డు జారీ కాలేదని తెలిపారు. విద్యార్థుల చదువు, ఇతర అవసరాల కోసం అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. స్పందించిన ఆర్డీవో 15 రోజుల్లో బాధిత పిల్లలకు ఆధార్‌కార్డు ఇప్పించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చినట్లు జెడ్పీటీసీ తెలిపారు.

క్లుప్తంగా

రేషన్ బియ్యం అక్రమ కొనుగోళ్లపై ఆడియో వైరల్

చెన్నూర్: రేషన్ బియ్యం వ్యాపారి కాంగ్రెస్ నాయకుడితో మాట్లాడిన ఆడియో మంగళవారం వైరల్‌గా మారింది. 'డీలర్ల వద్ద రేషన్ బియ్యం కొంటున్నావా.. కాంగ్రెస్ నాయకులు ఎవరైనా వెనుకాల ఉన్నారా' అంటూ ఓ కాంగ్రెస్ నాయకుడు ప్రశ్నించగా.. సదరు బియ్యం వ్యాపారి స్పందిస్తూ 'ప్రజలు తినడం లేదు.. వారి వద్దనే కొంటున్నా.. మీకు వచ్చిన ఇబ్బంది ఏమిటి?' అని ఎదురు ప్రశ్నించాడు. 'ఎమ్మెల్యేకు చెడ్డ పేరు వస్తుంది' అని కాంగ్రెస్ నాయకుడు అనగా.. 'నా తండ్రి గతంలో ఓ కాంగ్రెస్ నాయకుడితో తిరిగాడని అందరికీ తెలుసు.. రెవెన్యూ, సివిల్ సప్లయ్ అధికారులు ఉన్నారు.. వాళ్లు చూసుకుంటారు.. మీ పని మీరు చేసుకోండి.. నా పని నేను చేసుకుంటా.. ఎవరినీ మోసం చేస్తలేను' అంటూ మాటలతో ఎదురుదాడి చేశాడు. ఈ ఆడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్‌కు సన్మానం



జగన్‌ను సన్మానిస్తున్న న్యాయవాదులు

మంచిర్యాలక్రైం: ఫెడరేషన్ ఆఫ్ బార్ అసోసియేషన్ ఫర్ స్టేట్ ఆఫ్ తెలంగాణ సంయుక్త కార్యదర్శి, మంచిర్యాల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బండవరం జగన్‌ను మంగళవారం రంగారెడ్డి జిల్లా కోర్టు కాన్ఫరెన్స్ హాల్‌లో న్యాయవాదులు సన్మానించారు. రంగారెడ్డి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొండల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కృష్ణ, కార్యదర్శి రవికుమార్‌గౌడ్, మాజీ ప్రధాన కార్యదర్శులు మాధవరెడ్డి, జయరాజ్, పెంటారెడ్డి, సీనియర్ న్యాయవాదులతోపాటు హయత్‌నగర్, చేవెళ్ల బార్ అసోసియేషన్ల న్యాయవాదులు జగన్‌ను సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ.. మంచిర్యాల జిల్లా కోర్టు శాశ్వత భవనం ఏర్పాటుకు సహకరించాలని విన్నవించారు.

విద్యాశాఖకు త్వరగా మంత్రిని కేటాయించాలి



మాట్లాడుతున్న అక్షయ్‌కుమార్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటై ఆరు నెలలైనా విద్యాశాఖకు ఇంతవరకు మంత్రిని కేటాయించకపోవడం శోచనీయమని ఇటీవల పెద్దపల్లి ఎంపీగా పోటీ చేసిన మేకల అక్షయ్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం మంచిర్యాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఏర్పాటైన వెంటనే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విద్యాశాఖకు ప్రత్యేక మంత్రిని కేటాయించిందని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు మంత్రిని కేటాయించకపోవడంతో విద్యావ్యవస్థ కుంటుపడుతోందని తెలిపారు. ఇప్పటికే ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయకపోవడంతో కళాశాలల యాజమాన్యాలు విద్యార్థుల సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని ఆరోపించారు. దీంతో వారు కౌన్సిలింగ్ కేంద్రాల వద్ద ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి తక్షణమే విద్యాశాఖకు ప్రత్యేక మంత్రిని కేటాయించి విద్యావ్యవస్థను అభివృద్ధి పథంలో నిలుపాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట నాయకులు శ్రీకాంత్‌పటేల్, మేకల మల్లికార్జున్, జాడి భూమేశ్‌నేత, రాజేందర్, నిఖిల్ ఉన్నారు.

పప్పుదినుసుల సాగుతో లాభాలు

- తొలకరి సమయంలో సాగు చేస్తే మేలు
- జిల్లాలో సాగుకు అనువైన నేలలు
- స్వల్పకాలంలో కోతకు వచ్చే అవకాశం
- మార్కెట్‌లో విపరీతమైన డిమాండ్
- సాగుకు ఆసక్తి చూపుతున్న రైతులు



మంచిర్యాలఅగ్రికల్చర్: పప్పుధాన్యాల్లో ప్రధానంగా కంది, పెసర, మినుము జిల్లాలో సాగుకు అనుకూలమైన పంటలు. ఇందులో తక్కువ రోజుల్లో చేతికి వచ్చే పంటలు పెసర, మినుము. వీటి సాగుపై రైతులు అమిత ఆసక్తి చూపుతున్నారు. తొలకరి తర్వాత సాగు చేసుకుంటే ఈ పంటలు నేలను సారవంతం చేయడమే కాకుండా 60 నుంచి 75 రోజుల్లో పంట కోతకు వస్తుంది. ప్రస్తుతం పప్పుధాన్యాలకు మార్కెట్‌లో విపరీతమైన డిమాండ్ ఉంది. ఏ పప్పు ధర చూసినా రూ.100కు పైనే ఉంది. పప్పుధాన్యాల సాగుతో స్వల్పకాలంలో దిగుబడులు పొందడమే కాకుండా మంచి లాభాలు ఆర్జించవచ్చని ఆదిలాబాద్ వ్యవసాయ పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్త శ్రీధర్‌చౌహాన్ వివరిస్తున్నారు. కొద్దిపాటి సలహాలు, సూచనలు పాటించి సాగు చేస్తే పసిడిసిరులు కురిపిస్తుందని చెబుతున్నారు.

అన్ని నేలలకు అనువైన 'పెసర'

పంట మార్పిడిలోనూ అంతరపంటగాను పెసర అత్యంత అనువైనది. తక్కువ కాలంలో కోతకు వస్తుంది. ఆయకట్టు ప్రాంతాలు, చెరువులు, బోరుబావుల కింద రైతులు వరిసాగు చేసే భూముల్లోనూ ముందుగా పెసర వేసుకుని తర్వాత వరి నాటుకోవచ్చు. పెసర కోసిన తర్వాత పచ్చిరొట్ట ను భూమిలో కలియదున్నితే భూసారం పెరుగుతుంది. పెసర అన్ని రకాల నేలల్లో సాగు చేయవచ్చు. చౌడునేలలు, నీరు నిలిచే భూములు మాత్రం పనికి రావు.

పెసరలో రకాలు

ఎల్‌జీ-407 పెసర రకం 70-75 రోజులకు చేతికి వస్తుంది. ఎకరాకు 5-6 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. మొక్కలు నిటారుగా పెరిగి కాయలు మొక్క పైభాగాన కాస్తాయి. గింజలు మెరుస్తూ మధ్యస్థ లావుతో ఉంటాయి. ఎల్లోమొజాయిక్ తెగులు, నల్ల ఆకుమచ్చ తెగులును తట్టుకుంటుంది. ఎల్‌జీజీ-410 రకం 75 రోజుల పంట. దిగుబడి ఎకరాకు 5-6 క్వింటాళ్లు వస్తుంది. మొక్కలు నిటారుగా గుబురుగా పెరుగుతాయి. గింజలు పెద్దవిగా ఉండి మెరుస్తుంటాయి. ఒకేసారి కోతకు వస్తుంది. ఎల్‌జీజీ-50 రకం 65 నుంచి 70 రోజుల్లో కోతకు వస్తుంది. ఎకరాకు 4 నుంచి 6 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. మొక్కలు మధ్యస్థ ఎత్తులో ఉండి గుబురుగా కనిపిస్తాయి. పంట చేతికివచ్చే సమయంలో వర్షాలు కురిసినప్పటికీ గింజలు కొంతమేర చెడిపోవు. పూసా-105 రకం 65-70 రోజుల పంట. దిగుబడి 4-6 క్వింటాళ్లు వస్తుంది. అన్ని ప్రాంతాలకు అనువైనది. కాయలు మొత్తం మొక్క పైభాగంలోనే ఉండి అన్నీ ఒకేసారి కోతకు వస్తాయి. పల్లాకు తెగులు, ఆకుమచ్చ తెగులును కొంతమేర తట్టుకుంటుంది. ఎంజీజీ-295 రకం 65-70 రోజుల పంట. ఎకరాకు 5-6 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. మొక్కలు నిటారుగా పెరుగుతాయి. నల్లమచ్చ తెగులును తట్టుకుంటుంది. గింజ మధ్యస్థ లావుగా ఉండి మెరుస్తూ ఉంటుంది. ఎంజీజీ-347 రకం పంటకాలం 65-70 రోజులు. ఎకరాకు 5-6 క్వింటాళ్ల దిగుబడినిస్తుంది. మధ్యస్థ రకం. మొక్కలు నిటారుగా.. గుబురుగా పెరుగుతాయి. కాయలు మొక్క పైభాగాన కాసి ఒకేసారి కోతకు వస్తాయి. ఆకుమచ్చ తెగులు, ఎల్లోమొజాయిక్ తెగులును తట్టుకుంటుంది. డబ్ల్యూజీజీ-37 రకం 60 నుంచి 65 రోజుల పంట. గింజలు ఆకర్షణీయంగా, పచ్చగా నిగనిగలాడుతుంటాయి. అన్ని నేలల్లో సాగు చేసుకోవచ్చు. పంటంతా ఒకేసారి కోతకు వస్తుంది. ఎల్లోమొజాయిక్ తెగులును తట్టుకుంటుంది. 5-6 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. ఎల్‌జీజీ-460 రకం 60-65 రోజుల పంట. ఎకరాకు 5-6 క్వింటాళ్ల దిగుబడినిస్తుంది. కాయలు గుత్తులుగుత్తులుగా ఉండి కోయడానికి సులభంగా ఉంటుంది. పల్లాకు తెగులును తట్టుకుంటుంది. ఎంఎల్-267 రకం 65 రోజుల పంట. 4-6 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. మొక్క నిటారుగా ఉండి, కింది నుంచి పైదాకా కాస్తుంది.

మినుము

పొగాకు సాగు చేసే నల్లరేగడి భూముల్లో తొలకరి వర్షాలకు పంట మార్పిడి పంటగా మినుము సాగు చేసుకోవచ్చు. పెసర, మినుమును పంట మార్పిడి పంటగా, అంతరపంటగా సాగుచేసుకోవచ్చు. పెసర, మినుము మొక్కలు గాలిలోని నత్రజనిని రైజోబియం బ్యాక్టీరియా సహాయంతో స్థిరీకరించి పంట ఎదుగుదలకు ఉపయోగపడడమే కాకుండా ఎకరానికి సుమారు 20 కిలోల వరకు నత్రజనిని నేలకు అందిస్తాయి. మినుము పంట నీటి ఎద్దడిని తట్టుకోలేదు. తేమను నిలుపుకోలేని తేలికపాటి భూములు, ఎర్రనేలలు మినుము సాగుకు పనికి రావు. పల్లాకు ఆకుముడత వైరస్ తెగుళ్లు తొలకరిలో ఎక్కువగా ఆశిస్తాయి.

మినుములో రకాలు

ఎల్‌బీజీ-20 అన్ని కాలాలకు అనువైన రకం. ఆకులు సన్నగా, పొడవుగా ముదురుగాకుపచ్చ రంగులో ఉంటాయి. పల్లాకు తెగులును తట్టుకుంటుంది. గింజలు నల్లగా మెరుస్తుంటాయి. 70-75 రోజుల పంట కాలంలో ఎకరానికి 5-6 క్వింటాళ్ల దిగుబడినిస్తుంది. డబ్ల్యూబీజీ-26 రకం మొక్కలు గుబురుగా పొట్టిగా ఉంటాయి. గింజలు సాదాగా ఉంటాయి. అన్ని కాలాలకు అనువైన రకం. పల్లాకు తెగులును కొంతమేర తట్టుకుంటుంది. పంటకాలం 70-75 రోజులు. ఎకరానికి 4-5 క్వింటాళ్ల దిగబడి వస్తుంది. టీ-9 అన్ని కాలాలకు అనువైన రకం. మొక్కలు గుబురుగా, పొట్టిగా ఉంటాయి. ఆకులు సన్నగా ముదురాకు పచ్చరంగులో ఉంటాయి. పంట కాలం 70-75 రోజులు. 5-6 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది.

ఐటీఐ అడ్మిషన్ల గడువు పెంపు

మంచిర్యాలఅర్బన్: ఐటీఐలో మొదటి దఫా అడ్మిషన్ల గడువు పెంచినట్లు మంచిర్యాల ఐటీఐ ప్రిన్సిపాల్ చందర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 14వరకు ఆన్‌లైన్ దరఖాస్తులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

అధికారులకు చుక్కల దుప్పి అప్పగింత



చుక్కల దుప్పి

ఆసిఫాబాద్‌అర్బన్: చుక్కల దుప్పిని జిల్లా కేంద్రానికి చెందిన ఓ వ్యక్తి కుక్కల బారి నుంచి కాపాడినట్లు ఆసిఫాబాద్ రేంజ్ అధికారి అప్పలకొండ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు.. మండలంలోని మాణిక్‌గూడ పరిసర ప్రాంతాల్లో వ్యాపారి ఫయాజ్‌కు చెందిన ఫాంహౌస్‌లోకి మంగళవారం ఉదయం చుక్కల దుప్పిని కుక్కలు తరుముకుంటూ వచ్చాయి. ఆ సమయంలో అక్కడే ఉన్న ఫయాజ్ చిన్న కుమారుడు రహమాన్ కుక్కల బారి నుంచి దానిని రక్షించి అటవీ అధికారులకు అప్పగించారు. అటవీ అధికారులు ప్రథమ చికిత్స చేసి తిరిగి దుప్పిని అడవిలోకి వదలిపెట్టారు. ఈ సందర్భంగా రేంజ్ అధికారితోపాటు పలువురు రహమాన్‌ను అభినందించారు. డిప్యూటీ రేంజ్ అధికారి యోగేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

పోస్టులు తగ్గించొద్దని వినతి



వినతిపత్రం ఇస్తున్న అధికారులు

శ్రీరాంపూర్: సింగరేణిలో మైనింగ్ జీఎం పోస్టులను తగ్గించడంపై మైనింగ్ అధికారులు యాజమాన్యానికి వినతిపత్రం అందజేశారు. మంగళవారం కంపెనీ వ్యాప్తంగా చేపట్టిన కార్యక్రమంలో భాగంగా మైనింగ్ అధికారులు శ్రీరాంపూర్ ఇన్‌చార్జి జీఎం పురుషోత్తంరెడ్డిని కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మైనింగ్ అధికారులు అబ్దుల్ ఖదీర్, వెంకటేశ్వర్‌రెడ్డి, ఈ తిరుపతి మాట్లాడారు. కంపెనీలో పెరుగుతున్న బొగ్గు ఉత్పత్తి అవసరాల దృష్ట్యా 2011లో రూపొందించిన అధికారుల సంఖ్య ఆర్గనైజేషన్ ప్యాటర్న్ సరిచేయాలని చాలా రోజులుగా డిమాండ్ చేస్తున్నట్లు చెప్పారు. ఈ దశలో కంపెనీ మైనింగ్ జీఎం పోస్టులను 38, పర్సనల్ జీఎం పోస్టులు 4, ఫైనాన్స్ జీఎం పోస్టులు 2 పెంచి తదుపరి ఏర్పాటైన ఆర్గనైజేషన్ ప్యాటర్న్ కమిటీ మైనింగ్ విభాగానికి ఈ-8 పోస్టుల కింద 63 అదనపు జీఎం పోస్టులు మైనింగ్ సెకండ్ క్లాస్‌కు ప్రతిపాదించినట్లు తెలిపారు. ఈ సమయంలో మైనింగ్ జీఎం పోస్టులను తగ్గించడం సరికాదని పేర్కొన్నారు. వీటిని కొనగించాలని కోరారు. ఈ సందర్భంగా వారు సింగరేణి సీఎండీ, సీఎంవోఏఐ సింగరేణి బ్రాంచ్ అధ్యక్షులకు లేఖలు రాశారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌రెడ్డి, రాంనర్సయ్య, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.



కార్మికులతో మాట్లాడుతున్న శంకర్‌రావు

శ్రీరాంపూర్: డిపెండెంట్ల వయోపరిమితి పెంపు ఐఎన్టీయూసీ పోరాట ఫలితమేనని యూనియన్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు జట్టి శంకర్‌రావు తెలిపారు. మంగళవారం ఆయన ఆర్కే 6 గనిపై నిర్వహించిన బాయిబాట కార్యక్రమంలో కార్మికులను కలిసి మాట్లాడారు. కారుణ్య ఉద్యోగాల్లో వయోపరిమితిని 35 ఏళ్ల నుంచి 40 ఏళ్లకు పెంచాలని తాము పలుదఫాల్లో ఆందోళనలు, నిరసనలు తెలియజేశామని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత యూనియన్ సెక్రటరీ జనరల్ జనక్‌ప్రసాద్, పార్టీ ప్రజాప్రతినిధులతో కలిసి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లడంతో ప్రభుత్వ ఆదేశాల మేరకు యాజమాన్యం వయస్సు పెంపు ఉత్తర్వులు ఇచ్చిందని తెలిపారు. ఈ సందర్భంగా మిఠాయిలు పంచి, పటాకులు కాల్చారు. అనంతరం గని అధికారులను కలిసి గనిలోని సమస్యలు పరిష్కరించాలని, క్యాంటీన్, లాకర్ సౌకర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ జాతీయ సమితి సభ్యుడు భీంరావు, కేంద్ర ఉపాధ్యక్షుడు కలవేన శ్యామ్, డిప్యూటీ ప్రధాన కార్యదర్శి గరిగే స్వామి, ఏరియా నాయకులు తిరుపతిరాజు, వెంగళ కుమారస్వామి, పేరం రమేశ్, జీవన్‌రెడ్డి, మహేశ్, తిరుపతి, మహేందర్ పాల్గొన్నారు.

పోరాటం ఫలించింది



గేట్ మీటింగ్‌లో మాట్లాడుతున్న వీరభద్రయ్య

ఏఐటీయూసీ కృషి ఫలితమే..

ఏఐటీయూసీ కృషి ఫలితంగానే కారుణ్య ఉద్యోగాల్లో డిపెండెంట్ల వయోపరిమితిని 35నుంచి 40 సంవత్సరాలకు పెంచడం జరిగిందని యూనియన్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి కే వీరభద్రయ్య తెలిపారు. మంగళవారం ఆయన ఆర్కే 5గనిపై నిర్వహించిన గేట్ మీటింగ్‌లో కార్మికులనుద్దేశించి మాట్లాడారు. వయోపరిమితి పెంపుదలతో కార్మికుల పిల్లలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. ఎన్నో ఏళ్లుగా ఈ హక్కు కోసం కార్మికులు ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు. తమ యూనియన్ అధ్యక్షుడు, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఆధ్వర్యంలో నాయకులంతా ప్రభుత్వం దృష్టికి తీసుకుపోవడంతోనే ప్రభుత్వ ఆదేశాల మేరకు యజమాన్యం ఈ ఉత్తర్వులు ఇచ్చిందని తెలిపారు. ఈ సందర్భంగా గనిపై పటాకులు కాల్చి సంబురాలు చేసుకున్నారు. కార్యక్రమంలో యూనియన్ బ్రాంచ్ కార్యదర్శి ఎస్కే బాజీసైదా, నాయకులు విజయ్, విశ్వనాథరెడ్డి, రాజయ్య, సంజీవరెడ్డి, రమేశ్, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

శాంతిఖని భూగర్భగని తనిఖీ



షాఫ్ట్‌మ్యాన్ వైండింగ్‌ను పరిశీలిస్తున్న సభ్యులు

బెల్లంపల్లి: మందమర్రి ఏరియా శాంతిఖని భూగర్భ గనిని మంగళవారం రక్షణ తనిఖీ బృందం (సేఫ్టీ ఆడిట్ టీమ్) సందర్శించింది. జనరల్ మేనేజర్ కార్పొరేట్ కే గురువయ్య ఆదేశాల మేరకు మ్యాన్‌వైండింగ్ షాఫ్ట్ రక్షణ తనిఖీ బృందం గని మ్యాన్ వైండింగ్ పని తీరు, నాణ్యతను ఉపరితలంలో నిశితంగా పర్యవేక్షించారు. ఆతర్వాత గని భూగర్భంలోకి దిగి షాఫ్ట్ ఫిట్ బాటమ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా మెరుగైన మ్యాన్‌వైండింగ్ పనితీరు కోసం గని అధికారులకు తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. మ్యాన్‌వైండింగ్ సిస్టంను నిరంతరం పర్యవేక్షిస్తుండాలని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తనిఖీ బృందం అధికారులు ఏ రాజేశ్వర్‌రెడ్డి (ఏజీఎం), ఎం.రామానందం, ఎం.తిరుమల్‌రావు, జే నాగరాజు (ఏజీఎం ఈఅండ్‌ఎం), డీవైజీఎం బీ సీతారామ్, గని ప్రాజెక్ట్ అధికారి ఆర్.విజయప్రసాద్, ఏఎస్వో ఎం.రవీందర్, గ్రూప్ ఇంజినీర్ బసవరాజు, గని మేనేజర్ సంజయ్‌కుమార్ సిన్హా, ఎస్వో రాజు, గని అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్బీఐ సీఎస్పీ నిర్వాహకుడిపై పోలీసులకు ఫిర్యాదు

కాగజ్‌నగర్ రూరల్: పట్టణంలోని ఎస్బీఐ వద్ద గల సర్వీస్ పాయింట్ నిర్వాహకుడు రమేశ్ తీరుపై బాధితులు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. క్యాష్ డ్రా చేసి డబ్బులు ఇవ్వకుండా తిప్పించుకుంటున్నాడని పలువురు బాధితులు ఆరోపిస్తూ సోమవారం రాత్రి ఆందోళన చేశారు. డిపాజిట్ చేయమని ఇచ్చిన డబ్బులను సొంత అవసరాలకు వాడుకుని ప్రస్తుతం డబ్బులు లేవని చెబుతున్నాడని ఆరోపిస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు పోలీసులు విచారణ చేపట్టారు.

అమ్మ ఆదర్శ పనుల పరిశీలన



కేజీబీవీలో పనులు పరిశీలిస్తున్న యశోధర

మంచిర్యాలఅర్బన్: బుధవారం నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కానుండటంతో మంగళవారం స్థానిక కేజీబీవీ సన్నద్ధతపై సెక్టోరియల్ అధికారి యశోధర పరిశీలించారు. కేజీబీవీలో చేపట్టిన అమ్మ ఆదర్శ పనులు, పాఠశాల పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. పుస్తకాలపై ఆరా తీశారు. విద్యార్థులకు ఫోన్‌ద్వారా సమాచారం ఇచ్చి విద్యాలయానికి వచ్చేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఆమె వెంట ఎస్వో స్వప్న తదితరులు పాల్గొన్నారు.

సరిహద్దు దాటుతున్న ఎరువులు

- ధనార్జనే ధ్యేయంగా మహారాష్ట్రకు తరలింపు
- జిల్లాలో ఎరువుల కొరత ఏర్పడే అవకాశం



చెన్నూర్: వానాకాలం సీజన్ ప్రారంభమైంది. రైతులు ఎరువులు, విత్తనాలను సమకూర్చుకునే పనిలో నిమగ్నమయ్యారు. రైతుల అవసరాలను ఆసరాగా చేసుకుని వ్యాపారులు అక్రమాలకు తెరలేపుతున్నారు. ఇతర ప్రాంతాల నుంచి నకిలీ విత్తనాలు సరిహద్దు దాటి చెన్నూర్ మీదుగా జిల్లా కేంద్రానికి వస్తున్నాయి. ఇటీవల సరిహద్దు ప్రాంతంలో పోలీసులు పెద్ద ఎత్తున నకిలీ విత్తనాలను పట్టుకున్న విషయం తెలిసిందే. విత్తనాలు మహారాష్ట్ర మీదుగా అక్రమ రవాణా సాగుతున్నట్లు సమాచారం. మహారాష్ట్రలో ఎరువుల కొరత ఉండడంతో చెన్నూర్ కేంద్రంగా కొందరు వ్యాపారులు ఈ ప్రాంత రైతుల పేరుతో మహారాష్ట్రకు అక్రమ రవాణా చేసి సొమ్ము చేసుకుంటున్నారని తెలిసింది. యూరియా, కాంప్లెక్, డీఏపీ ఎరువులు సరిహద్దు దాటిపోతున్నట్లు సమాచారం.

అధిక ధరలకు విక్రయిస్తూ..

యూరియా బస్తాకు రూ.300 ఉండగా మహారాష్ట్రలో రూ.350 పలుకుతోంది. ఇలా ప్రతీ ఎరువు బస్తాపై రూ.50 నుంచి రూ.100 వరకు అధికంగా విక్రయిస్తున్నట్లు సమాచారం. దీంతో రాత్రికిరాత్రే ఎరువులను అక్రమంగా రవాణా చేస్తున్నట్లు తెలిసింది. చెన్నూర్ ప్రాంత అవసరాల కోసం తీసుకువచ్చిన ఎరువులు మహారాష్ట్రకు తరలిస్తే రానున్న రోజుల్లో ఈ ప్రాంతంలో ఎరువుల కొరత ఏర్పడే అవకాశం ఉందని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నిబంధనలు ఇలా..

ఒక జిల్లాకు కేటాయించిన ఎరువులు, విత్తనాలు పక్క జిల్లాకు పంపించడమూ నేరమే. ఏ జిల్లాకు కేటాయించిన ఎరువులు, విత్తనాలు ఆ జిల్లా రైతులకు మాత్రమే విక్రయించాల్సి ఉంది. పక్క జిల్లా, పక్క రాష్ట్రానికి తరలిస్తే కఠిన చర్యలు తీసుకునే అవకాశం ఉంది. పట్టుబడితే డీలర్ లైసెన్స్ రద్దు చేసే అధికారం అధికారులకు ఉంది. ఈ మేరకు ప్రభుత్వం కూడా కఠిన ఆదేశాలు జారీ చేసింది.

చెక్‌పోస్ట్ ఏర్పాటు చేశాం



ఎరువుల అక్రమ రవాణాను అరికట్టేందుకు రామగుండం సీపీ, మంచిర్యాల కలెక్టర్ ఆధ్వర్యంలో ఇటీవల సమావేశం ఏర్పాటు చేశాం. ఎరువులు అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రత్యేక బృందాలను నియమించారు. జయశంకర్ భూపాల్‌పల్లికి తరలివెళ్లకుండా అన్నారం బ్యారేజీపై చెక్‌పోస్టు ఏర్పాటు చేశారు. వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో నిత్యం ఎరువుల షాపులు తనిఖీ చేస్తున్నాం. మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతంలో చెక్‌పోస్ట్ ఏర్పాటు విషయమై ఉన్నతాధికారులు దృష్టి సారించారు. అక్రమ రవాణా సాగిస్తే ఎవరినీ ఉపేక్షించేదిలేదు. – మార్క్ గ్లడ్‌స్టోన్, ఇన్‌చార్జి వ్యవసాయాధికారి, చెన్నూర్

ఆర్థిక ఇబ్బందులతో యువకుడి ఆత్మహత్య



రవికుమార్ (ఫైల్)

రఘునాథపల్లి: ఆర్థిక ఇబ్బందులతో ఓ యువకుడు జీవితంపై విరక్తి చెంది రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన జనగామ జిల్లా రఘునాథపల్లి మండల నిడిగొండ రైల్వేగేట్ సమీపంలోని ట్రాక్‌పై చోటు చేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మంచిర్యాల జిల్లా నస్పూర్ మండల కేంద్రంలోని అంబేడ్కర్ కాలనీకి చెందిన సుర రవికుమార్ (31) హైదరాబాద్‌లో ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. వేతనం సరిపోక కొన్నాళ్లుగా ఆర్థిక ఇబ్బందులతో మనస్తాపం చెందుతున్నాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెందిన రవికుమార్.. మంగళవారం ఉదయం నిడిగొండ రైల్వేగేట్ సమీపంలోని ట్రాక్‌పై గుర్తుతెలియని రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలిని పరిశీలించారు. మృతదేహం నుజ్జునుజ్జు కావడంతో ఆధార్ కార్డు ఆధారంగా గుర్తించి కుటుంబీకులకు సమాచారమిచ్చారు. మృతదేహాన్ని జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబీకులకు అప్పగించారు. మృతుడి సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ రమణారెడ్డి, కానిస్టేబుల్ నరేశ్ తెలిపారు.

అందరూ గర్వపడే స్థాయికి ఎదగాలి



మమతను సన్మానిస్తున్న అధికారులు

తాండూర్: విద్యార్థులు వారి తల్లిదండ్రులతో పాటు సమాజం గర్వపడే స్థాయికి ఎదగాలని రాష్ట్ర విద్యాశాఖ సంచాలకుడు మల్లయ్య భట్టు సూచించారు. ఇటీవల విడుదలైన ఇంటర్ ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో మూడో ర్యాంక్, జిల్లా స్థాయిలో ప్రథమ ర్యాంక్ సాధించిన తాండూర్ కస్తూర్బా విద్యాలయానికి చెందిన దుర్గం మమతను మంగళవారం ఆయన హైదరాబాద్‌లోని తన కార్యాలయంలో సన్మానించారు. ఆయన మాట్లాడుతూ.. మరింత బాగా చదువుకుని జీవితంలో ఉన్నతంగా రాణించాలని అభిలషించారు. ఏఎస్పీడీ రమేశ్, జేడీ రాజీవ్, కేజీబీవీ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ డాక్టర్ హజారి శిరీష, కేజీబీవీ ఇన్‌చార్జి ఎస్వో సుమన చైతన్య, మనీషా, విద్యార్థిని తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ముగిసిన 'పది' పరీక్షలు

మంచిర్యాలఅర్బన్: జిల్లాలో పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు మంగళవారం ముగిశాయి. చివరిరోజు నిర్వహించిన సోషల్ పరీక్షకు 79 మందికి గాను 56 మంది విద్యార్థులు హాజరు కాగా 23 మంది గైర్హాజరయ్యారు. పరీక్షాకేంద్రాలను డీఈవో యాదయ్య తనిఖీ చేసినట్లు అసిస్టెంట్ కమిషనర్ ఫర్ ఎగ్జామినర్ దామోదర్‌రావు తెలిపారు.

ఆర్టీసీ ఉద్యోగిపై దాడి

మంచిర్యాలఅర్బన్: మంచిర్యాల ఆర్టీసీ బస్టాండ్‌లో ఆన్‌డ్యూటీలో ఉన్న ఉద్యోగి(కంట్రోలర్)పై దాడి చేసిన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. ఇద్దరు వ్యక్తులు షాపింగ్ చేయడానికి వచ్చి ఇన్‌గేట్ (అనుమతిలేని చోట) వద్ద కారు పార్కింగ్ చేసి వెళ్తుండగా కంట్రోలర్ గమనించారు. కారును అక్కడ నుంచి తీసివేయాలని సూచించారు. దీంతో వారిద్దరు ఉద్యోగి జమాల్‌పాషాపై పిడిగుద్దులు గుద్దారు. స్థానికులు, ఆర్టీసీ సిబ్బంది జోక్యంతో గొడవ సద్దుమణిగింది. ఈ వీడియో సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. ఆర్టీసీ కంట్రోలర్ జమాల్‌పాషా దాడి విషయమై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నామని సీఐ బన్సీలాల్ తెలిపారు.

ఆర్టీసీ ఉద్యోగిపై దాడి చేస్తున్న వాహనదారులు

